సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం। 19। ఆగస్టు। 2023



కాసులు కురిపిస్తున్న ఖర్జూరం

జిల్లాలో కొందరు రైతులు ఖర్జూరం సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. పులివెందుల, ముద్దనూరు, తొండూరు తదితర ప్రాంతాల్లో వంద ఎకరాల్లో సాగులో ఉంది. - IIలో



స్త్రీ నిధి రుణాలు మెక్కేశారు

స్త్రీ నిధి రుణాల్లో కొందరు చేతివాటం ప్రదర్శించారు. అధికారుల విచారణతో వాస్తవాలు వెలుగు చూశాయి. పీడీ పర్యవేక్షణలో నాలుగు బృందాలు విచారణ సాగిస్తున్నాయి. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.420
రెండోరకం	రూ.230	రూ.320

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 268 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సివిల్స్‌లో విజయమే లక్ష్యం



జయశ్రీ

రాజంపేట రూరల్: సివిల్స్ రాసి ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని గ్రూప్ 1 విజేత పోతుగుంట జయశ్రీ అన్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్ 1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికయ్యారు. పట్టణ పరిధిలోని ఎగువ బసినాయుడుగారిపల్లికి చెందిన పోతుగుంట నాగేశ్వరనాయుడు, నాగలక్ష్మిల ఏకైక కుమార్తె జయశ్రీ. ఈమె 1నుంచి10వ తరగతి వరకు రాజు హైస్కూల్‌లో, ఇంటర్ హైదరాబాదులోని శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమిలో, డిగ్రీ ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజీలో, ఎంఏ హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీలో విద్యనభ్యసించారు. మొదటి పర్యాయం గ్రూప్-1 పరీక్షలు రాసినట్లు శుక్రవారం ఇక్కడి విలేకర్లకు తెలియజేశారు. ఐఏఎస్ కావటం తన ఆశయం అని ఆమె వెల్లడించారు. జయశ్రీ ఎంపీడీఓగా ఎంపిక కావడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

డీటీ నుంచి గ్రూప్ 1 ఆఫీసర్‌గా!



గజ్జల సురేంద్రారెడ్డి

సిద్దవటం: మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామానికి చెందిన గజ్జల సురేంద్రారెడ్డి గ్రూప్-1 పాసై వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్‌గా ఎంపికయ్యారు. ఈయన ఎమ్మెస్సీ పూర్తి చేసి 2018లో గ్రూప్-2 విభాగంలో డిప్యూటీ తహసీల్దారుగా ఎంపికయ్యారు. తాజాగా గ్రూప్-1 ఫలితాల్లో వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్‌గా ఎంపిక కావంతో తల్లి దండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా హరిత



రాయచోటి: గ్రూప్-1 ఫలితాల్లో రాయచోటికి చెందిన రామాపురం హరిత అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా ఎంపికయ్యారు. పట్టణంలో నివాసముంటున్న టీచర్ జయరామరాజు, భారతిల కుమార్తె హరిత. ఈమె టెన్త్ వరకు పట్టణంలోని రాజుస్కూల్‌లో విద్యాభ్యాసం చేసింది. సచివాలయ సెక్రెటరీగా ఎంపికై ఏడాది పాటు ఆమె ఉద్యోగం చేసింది. ప్రస్తుతం గ్రూప్-1లో విజయం సాధించింది. సివిల్స్‌లో రాణించడమే తన లక్ష్యమంటోంది. హరితకు తోటి మిత్రులు, బంధువులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ కుటుంబంలో మెరిసిన పవిత్ర



మదనపల్లె సిటీ: అన్న ప్రోత్సాహంతో తాను గ్రూప్-1 ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన మాకినేని పవిత్ర తెలిపారు. గ్రూప్-1 ఫలితాల్లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (ఏటీఓ)గా ఎంపికయ్యారు. తండ్రి ప్రభాకర్‌నాయుడు వ్యవసాయం చేస్తున్నాడు. తల్లి లక్ష్మీదేవి గృహిణి. అన్న పురుషోత్తం సూచన మేరకు ఆన్‌లైన్‌లో ప్రిపేరై మొదటి ప్రయత్నంలోనే విజేతగా నిలిచింది. పదో తరగతి స్థానిక జ్ఞానోదయ పాఠశాల, ఇంటర్మీడియట్ సిద్దార్థ కాలేజీ, బిటెక్ మిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ చేసింది. కలెక్టర్ కావాలన్నదే తన ధ్యేయమని పవిత్ర తెలిపింది.

ఖరీఫ్ ఉక్కిరి బిక్కిరి..



- ముఖం చాటేసిన వరుణుడు
- జిల్లాలో 82,589 హెక్టార్లకుగాను 23,410 హెక్టార్లలో సాగైన పంటలు
- 29శాతం లోటుతో వర్షపాతం నమోదు



పీలేరు డివిజన్ పరిధిలో సాగై వర్షం లేక వాడు ముఖంతో కనిపిస్తున్న వేరుశనగ పంట

రాయచోటి: మబ్బులు పడుతున్నాయి. వర్షం జాడ కనిపించడం లేదు. ఆగస్టు 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట ప్రాంతాల్లో అడపాదడపా ఒక మోస్తరు వర్షం కురుస్తున్నా మదనపల్లె, పీలేరు డివిజన్లలో మాత్రం వాన జాడ లేకుండా పోయింది. జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు 17 వరకు జిల్లా వ్యాప్తంగా 273.5 మి.మీలు కురిసింది. జిల్లాలో ములకల చెరువు మండలంలో మాత్రమే సాధారణ వర్షపాతం కంటే 20 శాతం అధికంగా నమోదైంది. మరో 5 మండలాల్లో వర్షపాతం లోటు కనిపించగా, 15 మండలాలలో తక్కువ వర్షపాతం నమోదూది. 9 మండలాలలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. మరోవైపు ఎండలు మండిపోతున్నాయి. ఒకవైపు ఉక్కపోతతో సామాన్యులు ఆపసోపాలు పడుతుండగా మరోవైపు సాగు ముందుకు సాగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో అసలైన వేసవి చూసిన జిల్లా వాసులు జూన్‌లో నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రెండో వేసవి చూశారు. ఇక ఆగస్టులో చినుకు కూడా లేక పోవడంతో ముచ్చటగా మూడో వేసవిని చూస్తున్నారు. జిల్లాలో గత పదిహేను రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 26 నుంచి 28 డిగ్రీల మధ్య ఉంటున్నాయి.దీంతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవిని తలపిస్తున్న ఎండలతో మధ్యాహ్నం ఆపసోపాలు పడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా వేడిగాలితో చెమటలు కక్కుతున్నారు. ఇప్పటి వరకు ప్రతినెల లోటు వర్షమే. కానీ ఆగస్టు నెలలో పరిస్థితి మరీ దారుణం. ఏకంగా మైనస్ 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

నాట్లు ఆలస్యం.....

నైరుతిలో లోటు వర్షం కురవడంతో ఆ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడింది. జిల్లాలో 82,589 హెక్టార్లలో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 23,410 హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. అంటే జిల్లా వ్యాప్తంగా 28.34 శాతం మాత్రమే సాగైంది. జిల్లాలో వర్షాధారంగా వేరుశనగ పంటను ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 47,885 హెక్టార్లలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా 13,313 హెక్టార్లలో మాత్రమే సాగైంది. దీంతో 27.8 శాతానికి మించలేదు. మరో ప్రధాన పంట అయిన వరి 9,748 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 3239 హెక్టార్లలో మాత్రమే సాగై 33.23 శాతం మాత్రమే నమోదైంది. బావులు, బోర్ల కింద నీటి లభ్యతను బట్టి ఆగస్టులో సైతం నాట్లు పడడం సర్వసాధారణమే. అయినా వర్షాలు ముఖం చాటేయడంతో పలుచోట్ల నాట్లు ఆలస్యమవుతున్నాయి. రాయచోటి, రాజంపేట, మదనపల్లి, పీలేరు, వ్యవసాయ సబ్ డివిజన్‌లో నాట్లువేసే పనిలో రైతులు ఉన్నారు. లోటు వర్షమే అయినా ఖరీఫ్ ఆశాజనకంగా ఉందంటే అందుకు జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు, చెరువుల్లో ఉన్న నీరే కారణం. మరోవైపు ఉద్యాన పంటలపై కూడా లోటు వర్షపాతం ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా మామిడి పంటపై తెగుళ్ల విజృంభణ పెరిగింది. దీంతో రైతులు,వ్యాపారులు నష్టాన్ని మూట కట్టుకున్నారు. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం పది డిగ్రీలు దాటి నమోదవుతుండడంతో దోమల బెడద ఎక్కువైంది. వర్షాలు లేక పోవడంతో జిల్లాలో ఖరీఫ్ సాగు ఆలస్యమైంది. జూన్ మాసంలో వర్షాధార పంటలను సాగు చేయడం, జూలై నుంచి ఆగస్టు నెలకల్లా నాట్లువేయడం ప్రతి ఏటా జరిగేది. వరుణదేవుడు అనుకూలిస్తే వచ్చే పది, పదిహేను రోజులలో జిల్లాలో నాట్లు పూర్తి కానున్నాయి.

నెల	కురవాల్సిన వర్షం (మి.మీలలో)	నమోదైన వర్షపాతం (మి.మీలలో)
జూన్	75.1	44.4
జూలై	90.5	58.4
ఆగస్టు (17వ తేదీ వరకు)	61.9	18.7



ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి



ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు అనుకూలంగా కురవకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలని రైతులకు సూచించాం . సాగుకు అవసరమైన విత్తనాలను కూడా గ్రామీణ ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రాలలో సబ్సిడీపై అందిస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో 28.34 శాతం మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయి. జిల్లాకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేస్తాం. – చంద్రనాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

పెద్దదర్గాలో హీరో కార్తికేయ ప్రార్థనలు



దర్గా సందర్శనకు వచ్చిన సినీ హీరో కార్తికేయ

కడప కల్చరల్: సినీ యువ నటుడు కార్తీకేయ శుక్రవారం ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్నారు. తన సినిమా యూనిట్ సహచరులతో కలిసి ఆయన దర్గాకు వచ్చారు. దర్గా ముజావర్ అమీర్ ఆయనకు సంప్రదాయంగా పేటా చుట్టి కండువా ధరింపజేశారు. తొలుత దర్గాలోని ప్రధాన గురువులైన హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ మజార్‌ను, అనంతరం దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు, ఫాతెహా నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటికే నానిస్ గ్యాంగ్ లీడర్, వలిమై, ఆర్ఎక్స్ 100 చిత్రాల్లో నటించానని, ప్రస్తుతం బెదురులంక చిత్రం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చామన్నారు. దర్గా గురువులను దర్శించుకుని ప్రార్థనలు చేశామని వివరించారు.

ఫారం-10 గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆదాయపు పన్ను చట్టాలు, నూతన సవరణలకు సంబంధించి ఫారం-10ఏ గడువును సెప్టెంబరు 30 వరకు పొడిగించామని తిరుపతి ఆదాయపు పన్ను అధికారి కేసీ శ్రీకాంత్ తెలిపారు. కడపలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో ఆదాయపు పన్ను చట్టాలు, ఫారం-10 గడువు పొడిగింపు తదితర అంశాలపై చార్టెడ్ అకౌంటెంట్లు, ఆడిటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కడప జిల్లా చార్టెడ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖ్వాజా హుసేన్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జయరాం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

- మహిళలకు అన్ని రకాలుగా చేయూతనిస్తున్న ప్రభుత్వమిది
- ప్రతిపక్షనేతలవి అనవసర విమర్శలు
- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి



ఆహా క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి

రాయచోటి అర్బన్: మహిళలను గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మెప్మా భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్‌మార్కెట్, ఆహా క్యాంటీన్‌లను వారు ప్రారంభించారు. అనంతరం జగనన్న మహిళా మార్టు ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. తొలుత మెప్మా ఎండీ విజయక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎస్‌హెచ్‌జీల మహిళలే పెట్టుబడి పెట్టడం, వ్యాపారం చేయడం, లాభాలను ఆర్జించడమే ధ్యేయంగా దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో జగనన్న మహిళామార్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలో రాష్ట్రంలో మున్సిపాలిటీలలో పట్టణ మహిళా ప్రగతి యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎల్లవేళలా మహిళలకు అండగా ఉంటానన్నారు. మహిళలు మరింతగా చైతన్యవంతులు కావాలన్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న మున్సిపాలిటీ భవనాన్ని జగనన్న మహిళామార్టు ఏర్పాటుకు ఉచితంగా ఇప్పించేందుకు ఎంతో కృషిచేశామన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ వ్యాపారం,లాభాలు సాధించవచ్చునన్న విషయాన్ని మహిళలు జగనన్న మహిళా మార్టుల ద్వారా నిరూపించారన్నారు. గత ఏడాది రూ.14.5లక్షలుగా ఉన్న పెట్టుబడి మార్టులో ఆర్జించిన లాభాల కారణంగా నేడు రూ.21లక్షలకు పెరిగిందన్నారు మహిళలకు మేలు చేయాలనే తపనతో ఉన్న జగనన్న ప్రభుత్వానికి అందరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అభివృద్ధితోనే ప్రజల జీవనశైలి మారుతుందన్నారు. వైఎస్ కుటుంబానికే రాష్ట్రాభివృద్ధిపై మంచి విజన్ ఉందన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను అమల్లోకి తేవడమే ఇందుకు నిదర్శనమన్నారు. మాట్లాడితే విజన్ గురించి గొప్పలు చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి ఏం చేశారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఇక లోకేష్,పవన్ కళ్యాణ్ తమ గుర్తింపు కోసం , రాజకీయ లబ్ధి కోసం సీఎం జగనన్నపై అనవసర విమర్శలు చేస్తుండడం దుర్మార్గమన్నారు.మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. కౌన్సిలర్ ఆసిఫ్‌అలీఖాన్, మెప్మా పట్టణ అధికారి అబ్బాస్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



ఓటర్ల జాబితా తయారీపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ కోరారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఓటర్ల జాబితా తయారీ, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల ధ్రువీకరణ తదితర అంశాల మీద వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ బీఎల్ఏలు, మండల ఇన్‌చార్జులు నియోజకవర్గ ఇన్‌చార్జీల వివరాలు సమర్పించాలని గత సమావేశంలో కోరామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడంలో భాగంగా ప్రతి నియోజకవర్గాల వారీగా అక్కడి రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మినిట్స్‌ను జిల్లాలోని రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందరికీ ఇచ్చామన్నారు. ఇంటింటి వెరిఫికేషన్‌లో అందరూ భాగస్వాం అయినప్పుడే మనం తప్పులు లేకుండా ఎన్నికల ఓటర్ల జాబితాను తయారు చేయగలమని రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఇంటింటికీ పరిశీలన నిమిత్తం వెళ్లినప్పుడు ఆ ఇంట్లోనే ఓటర్ జాబితాలో వారు కాకుండా కొత్తవారు ఉంటే వారి నుంచి ఫారం 8 తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పోలింగ్ బూతుల హేతుబద్ధీకరణకు సంబంధించి మాట్లాడుతూ సెప్టెంబర్ 29 వరకు సమయం ఉందని.. గడువు ముగిసే సమయానికి ముందు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయ పార్టీలకు ఇందుకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి అందిన డూప్లికేట్ ఓటర్ల వివరాలను వెల్లడించారు. ఈ నెల 30 నాటికి విచారణ చేసి తుది జాబితా అందించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. అలాగే రాయచోటి, మదనపల్లె, రాజంపేట, కోడూరు మున్సిపాలిటీల పరిధిలో బీఎల్ఓలతో సమీక్ష చేసి కమిషన్ నిర్దేశించిన మేరకు ఫారం 8లో వివరాలు పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఓటరు జాబితా ఇంటింటి సర్వేపై ఫారం 6 నుంచి ఫారం 11బి వరకు మండలాల వారీగా సేకరించిన జాబితా ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రం రాయచోటిలో ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ చుట్టూ సీసీ కెమెరాలు, పటిష్టమైన భద్రత కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు అందించిన సలహాలు సూచనలు కూడా పరిగణనలోకి తీసుకొని తప్పులు లేని ఓటర్ జాబితా రూపకల్పనకు కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, సంబంధిత తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రం.. రంగురంగుల జ్ఞాపకం

గతమంతా ఓ జ్ఞాపకమే.. గుర్తుకొస్తే ఎప్పటికీ ఓ మధురానుభవమే.. అది తీపయినా.. చేదయినా మనసు పొరల్లో చెదరని ఓ సంతకమే.. మనిషి లోని.. మనసులోని ఆ జ్ఞాపకాలను కలకాలం పట్టి ఉంచేది 'చిత్రం'. చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిపేదీ ఆ చిత్రమే. అందుకే వందల పదాలతో పలికించే భావం ఒక్క చిత్రానికి సమానమన్నది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

- ఆధునికతతో కొత్తపుంతలు
- స్మార్ట్‌ఫోన్‌లు వచ్చినా ఫొటోగ్రాఫర్లపై పెద్దగా చూపని ప్రభావం
- ఫొటోగ్రఫీతో జిల్లాలో వందలాది కుటుంబాలకు ఉపాధి



ఈ రోజుకు సెలవంటూ అస్తమిస్తున్న సూరీడు.. వేళయిందంటూ గూటికి చేరుతున్న పక్షి.. దేవునికడప చెరువు వద్ద కనిపించిన అందమైన సాయం సంధ్య దృశ్యం. -ఫొటో: రమేష్



రాజంపేట టౌన్: ఫొటోగ్రఫీ ఒక ప్రత్యేకమైన కళ. వందేళ్ల కిందటి బ్లాక్ అండ్ వైట్ స్థాయి నుంచి ఈ రంగాన్ని నేడు రంగుల ప్రపంచంలోకి తెచ్చిన నిత్య నూతన కళ ఇది. కెమెరాల్లో మార్పులు వచ్చినా, డ్రోన్ లాంటి చేర్పులు తోడైనా ఇందులోని సృజనాత్మకత హృదయాన్ని మెత్తగా తాకుతుంది. అందుకే ఇది కళగా మారి ఎప్పటికప్పుడు ఈ రంగంలో కొత్త రంగుల ఇంద్రధనస్సును ఆవిష్కరింపజేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఫొటోగ్రఫీ కళాత్మకమైన విద్య. సెల్ ఫోన్ అందుబాటులోకి వచ్చాక ఫొటోలు తీసుకోవడం చాలా సులువైపోయింది. ఇప్పుడు దాదాపు అందరికీ స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంది. అయితే ఫొటోగ్రాఫర్లు ఫోటోలను తీసి వాటిని తమ ప్రతిభతో చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. అందువల్ల ప్రజలు చిన్న ఫంక్షన్ అయినా ఫొటోగ్రాఫర్‌ల ద్వారా ఫొటోలు, వీడియోలను తీయించుకొని భద్రపరుచుకుంటున్నారు. ఫొటోగ్రఫీపై ఆధారపడి జిల్లాలో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. అన్నమయ్య జిల్లాలో సుమారు 1500 మంది ఫొటోగ్రఫీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని అంచనా. ఒక్క రాజంపేట నియోజకవర్గంలోనే సుమారు 300 మంది ఫొటోగ్రాఫర్లు ఉన్నారు.

తగ్గని ఆదరణ

స్మార్ట్‌ఫోన్‌లు అందుబాటులోకి వచ్చాక ఇళ్లల్లో వాడుకునే కెమెరాలు కనుమరుగయ్యాయి. స్మార్ట్ ఫోన్‌ల ప్రభావం ఫొటోగ్రాఫర్లపై పూర్తిస్థాయిలో పడకపోవడం విశేషం. ఆధునికతను అందుపుచ్చుకోలేని కొంత మంది ఫోటో గ్రాఫర్లపైనే స్మార్ట్‌ఫోన్‌ల ప్రభావం పడింది. ప్రతిభగల ఫొటోగ్రాఫర్స్ కు మాత్రం డిమాండ్ తగ్గలేదని చెప్పవచ్చు.

వెడ్డింగ్ ఫొటోగ్రఫీకి పెరుగుతున్న డిమాండ్

ప్రస్తుతం పేద, మధ్య తరగతి అని కాకుండా ప్రతి ఒక్కరూ తమ తమ స్టేటస్‌కు తగ్గట్లు శుభకార్యాలు చేయాలనుకుంటున్నారు. ఇక ఆయా కార్యక్రమా లకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఎంతో గ్రాండ్‌గా ఉండేందుకు ఖర్చుకు ఏమాత్రం వెనకాడటం లేదు. ఇక వెడ్డింగ్ ఫోటోగ్రఫీకి డిమాండ్ ఎక్కువవుంది.

మంచిభవిష్యత్తు ఉంటుందని..



నాపేరు జుబేర్. మానాన్న ఫొటో గ్రాఫర్ అయినందున నేను చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీపై ఇష్టం పెంచుకున్నాను. కొన్నేళ్ల పాటు ఈ వృత్తిలోనే కొనసాగుతూ ఆధునిక పద్ధతుల్లో ఫోటోలు, వీడియోలను తీర్చిదిద్దడం నేర్చుకున్నా ను. ఈ రంగంలో మంచి భవిష్యత్తు ఉంటుందని కొన్ని నెలల క్రితం ఫోటో స్టూడియోను పెట్టాను. –జుబేర్, ఫొటో స్టూడియో యజమాని, రాజంపేట

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

అన్నమయ్య జిల్లాలో ఎంపీ ల్యాడ్స్, డీఎంఎఫ్ నిధులు రూ.21.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యతనిచ్చి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాలులో ఎంపీ ల్యాడ్స్, డీఎంఎఫ్ నిధులతో జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిపై సీపీఓ, మైనింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో ఎంపీ ల్యాడ్స్, డీఎంఎఫ్ నిధులతో 417 అభివృద్ధి పనులను రూ.21.60 కోట్ల అంచనాతో చేపట్టామన్నారు. ఇందులో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.12.02 కోట్లతో 302 పనులను చేపట్టగా ఇప్పటివరకు రూ.3.52 కోట్లు ఖర్చు చేసి 100 పనులను పూర్తి చేశారన్నారు. అలాగే డీఎంఎఫ్ నిధులు రూ.9.58 కోట్ల అంచనాతో 115 పనులు చేపట్టగా.. రూ.2.69 కోట్లు ఖర్చు చేసి 32 పనులు పూర్తి చేశారన్నారు. 79 పనులకు పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు కాగా మిగిలిన వాటికి అనుమతులు పొందాల్సి ఉందన్నారు. సదరు పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పూర్తి అయిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. సీపీఓ కృష్ణానాయక్, ప్లానింగ్ శాఖ ఏడీ వెంకట్, జిల్లా మైనింగ్ అధికారి రవిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ ప్రసన్నకుమార్, జిల్లా ట్రెజరీ అధికారి మహబూబ్, ఇంజనీరింగ్ శాఖల ఈఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్' ఫీజు గడువు పొడిగింపు

వైవీయూ: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి చెల్లించాల్సిన ఫీజు గడువును సెప్టెంబర్ 9వ తేదీ వరకు పొడిగించినట్లు కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ స్టడీ సెంటర్ (154) కో–ఆర్డినేటర్ ఎం. వీరభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఓపన్ ఇంటర్ విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు అర్హులన్నారు. బీ.కాం కంప్యూటర్స్ కోర్సు కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాల స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

చిన్నారి కిడ్నాప్ కలకలం



చిన్నారిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రం నల్ల గుట్టకు చెందిన ఒక చిన్నారి కిడ్నాప్ అయ్యాడంటూ శుక్రవారం కలకలం రేగింది. దీనితో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారు రంగంలోకి దిగారు. కుటుంబ సభ్యులు ఉంటున్న విధిలోనే చిన్నారి దొరకడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నల్లగుట్టకు చెందిన రజియా, నిసార్‌ల ఐదేళ్ల కుమారుడు అయాన్ మాధ్యాహ్నం ఇంట్లో నుంచి వీధిలోకి వచ్చి పక్కంటిలో నిద్రపోయాడు. తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భయభ్రాంతులకు గురయ్యారు. చేసేదిలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. చిన్నారి ఇంటి పక్కలోనే ఉండడాన్ని గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు అప్పగించారు.

త్వరితగతిన పట్టణాల్లో రీసర్వే పూర్తి

రాజంపేట : రాష్ట్రంలో ఎంపిక చేసిన పట్టణాల్లో రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలని స్టేట్ రీసర్వే స్పెషలాఫీసర్ ఐఏఎస్ అధికారి సుబ్బారావు అన్నారు. శుక్రవారం రాజంపేట పురపాలక సంఘంలో రీసర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హక్కు పత్రం ఇవ్వడానికే ఈ సర్వే జరుగుతోందన్నారు. నిబంధనలను ఇప్పటికే తెలియజేశామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. సమావేశంలో మేజనర్ శేషఫణి, టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా స్పెషలాఫీసర్ సుబ్బారావుతో రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రీసర్వే తీరుతెన్నులపై చర్చించారు. పకడ్బందీగా రీసర్వే కొనసాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ వివరించారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



పీలేరు రూరల్ : ఎదురొచ్చిన వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కారు బోల్తా పడ్డ సంఘటన స్థానిక కడప రోడ్డు మార్గంలోని వెంకటాద్రి ఇళ్ల వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. కేవీపల్లె మండలం సొరకాయలపేట పంచాయతీ కుప్పంవారిపల్లెకు చెందిన సంజీవరెడ్డి (60) తన కుమార్తె శ్వేతతో కలసి కారులో పీలేరు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే వెంకటాద్రి ఇళ్ల ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడి కారు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో సంజీవరెడ్డి గాయపడగా, శ్వేత సురక్షితంగా బయటపడింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాసులు కురిపిస్తున్న ఖర్జూరం

తరాలు మారుతున్నాయి. అవసరాలను మార్కెట్‌లో క్షుణ్ణంగా పరిశీలించిన వారు కొత్త పంటలలో ఉన్న అవకాశాలను వెతికి పట్టుకుని.. అద్భుత విజయాలు నమోదు చేస్తున్నారు. తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

- పంట సాగుపై రైతుల ఆసక్తి
- జిల్లా వ్యాప్తంగా 100 ఎకరాల్లో..
- మార్కెట్‌లో కిలో రూ.240



పులివెందులలో సాగు చేసిన ఖర్జూర పంట



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

పులివెందుల రూరల్ : ఎడారిలో పెరిగే వృక్షం ఖర్జూరం. పోషక విలువలతో కూడిన తియ్యదనం దాని సొంతం. ఈత చెట్టును పోలి ఉండే.. ఈ పంట సాగు చేయడమంటే సాహసమే. అయితే జిల్లాలో కొందరు రైతులు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా తొండూరు, కొండాపురం, అట్లూరు, పులివెందుల, పెండ్లిమర్రి, ముద్దనూరు, మైదుకూరు, లింగాల, వేంపల్లె, సింహాద్రిపురం, పెద్దముడియం మండలాల్లో సుమారు 100 ఎకరాలలో సాగు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో..

ఖర్జూర సాగుకు ఎర్ర, నల్ల నేలలు అనుకూలం. నీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాలు, సమస్యాత్మక భూముల్లో సైతం సులభంగా పెరగ గల మొండి జాతి మొక్క. ఇవి నెమ్మదిగా పెరిగే చెట్లు. దృఢంగా ఉంటాయి. ఎక్కువ వేడి, తక్కువ నీరు అవసరం. బోరులో నీరు ఉంటే రెండు ఎకరాలలో సాగు చేసుకోవచ్చు. సాధారణంగా ఒక మొక్క ధర దాదాపు 150 రూపాయలు. కానీ అవి 6 లేదా 7 ఏళ్ల వయసు వరకు ఎటువంటి పంటను ఉత్పత్తి చేయవు. దీని కారణంగా కల్చర్డ్ టిష్యూ ప్లాంట్లను ఉపయోగించి ఖర్జూరాన్ని సాగు చేస్తున్నారు. ఈ మొక్కలు చాలా ఖరీదైనవి, ఒక్కో మొక్కకు దాదాపు 3,100 రూపాయలు అవుతుంది. కాబట్టి ఎకరాకు సుమారు రూ.1,86,000 వరకు వ్యయం అవుతుంది.

ప్రారంభ పెట్టుబడి అధికం

తొలి ఏడాది పెట్టుబడులు, ఖర్చులు అధికంగా భరించాల్సి ఉంటుంది. నాణ్యమైన మొక్కలు కొనుగోలు చేయటం, నాటడం, భూమి చదును, ఎరువులు, కూలీల ఖర్చు తదితరాలు ఉంటాయి. రెండు, మూడేళ్లకు కొంత పెట్టుబడి తగ్గుతుంది. తర్వాత క్రమేణ పూర్తిగా తగ్గుతుంది. పెట్టుబడులలో 80 శాతం మొక్కలకే ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రారంభ పెట్టుబడి అధికంగా ఉన్నా 5 ఏళ్లలో తిరిగి రాబట్టుకునే అవకాశం ఉంది. రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు. పశువుల ఎరువులు వేసి దిగుబడులు సాధించవచ్చు. ఈ పంటకు చీడపీడల బెడద చాలా తక్కువ. అయితే వర్షా కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

50 ఏళ్ల వరకు దిగుబడి

ఈ మొక్కలు తమ మొదటి పంటను ఉత్పత్తి చేయడానికి మూడేళ్లు పడుతుంది. ఆ తర్వాత ఒక్కో మొక్క 20 నుంచి 30 కిలోల ఖర్జూరాన్ని ఉత్పత్తి చేస్తుంది. క్రమేణ దిగుబడి పెరుగుతుంది. జీవిత కాలంలో ఈ చెట్లు 40 నుంచి 50 అడుగుల ఎత్తుకు చేరుకుంటాయి. ఒక్క సారి నాటితే 50 ఏళ్ల వరకు దిగుబడి తీసుకోవచ్చు. ఫిబ్రవరి రెండవ వారం నుంచి మార్చి రెండవ వారం వరకు పూత వస్తుంది. పూత వచ్చే నెల రోజుల ముందుగా నీటి తడులు ఆపేస్తే మంచి పూత, పిందె పడుతుంది. తోటలో ఎకరాకు 10 నుంచి 12 మగ ఖర్జూర చెట్లు నాటుకోవాలి. మగ చెట్లు కేవలం పూలు పూస్తాయి. అవి పూసే పూలతో ఆడచెట్ల పూలు పరపరాగ సంపర్కం చేయించాలి. ప్రతి గెలకు జాగ్రత్తగా ఈ ప్రక్రియను చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు



నాకున్న మూడు ఎకరాలలో ఖర్జూర పంట సాగు చేశాను. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేశాను. 5 ఏళ్ల క్రితం బర్హి ఎల్లో రకం మొక్కలు నాటాను. అధిక లాభాలు ఉంటాయని సాగు చేశాను. పంట కోతకు వచ్చే సమయం వచ్చింది. పంట కూడా బాగా ఉంది. – ఆంజనేయులు, రైతు, ఎర్రిపల్లె

వ్యాపారం బాగుంది



ఖర్జూర పంటను పులివెందుల, లింగాల, వేంపల్లె, సింహాద్రిపురం ప్రాంతాలలో రైతులు సాగు చేశారు. వాటిని తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేసుకుని పులివెందులలో వ్యాపారం చేస్తున్నాం. మార్కెట్‌లో ఖర్జూరాలకు గిరాకీ ఉంది. కిలో రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నాం. వ్యాపారం బాగా జరుగుతోంది. – మోహన్, వ్యాపారి, పులివెందుల

బర్హి ఎల్లో రకం మంచిది



జిల్లాలో కొంత మంది రైతులు సుమారు 100 ఎకరాలలో బర్హి ఎల్లో రకం ఖర్జూర పంట సాగు చేశారు. ఖర్జూరం పంటపై అవగాహన ఉంటేనే సాగు చేయాలి. ఇది ఎడారి పంట కావడంతో వానా కాలంలో చీడ, పీడలు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అదనపు ఆదాయం కోసం తోటలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. రైతులు ఖర్జూరంపై ఆసక్తి చూపుతున్నారు. – రాఘవేంద్రారెడ్డి, హెచ్‌ఓ, పులివెందుల

పోరాటాలతోనే ఉక్కు పరిశ్రమ సాధ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు యువత పోరాటాల ద్వారానే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదని ధ్వజమెత్తారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి కావాల్సిన ఇనుప ఖనిజం, సున్నపు రాయి తదితర ఖనిజాలు ఉన్నాయని తెలిపారు. విద్యుత్ ఆర్టీపీపీ నుంచి వస్తుందని, నీరు మైలవరం గండికోట, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ల నుంచి వస్తాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బ్రహ్మణి స్టీల్ ఫ్యాక్టరీ కోసం శంకుస్థాపన చేసి నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కర్నూలులో బీజేపీ నాయకులు ఢిల్లీ డిక్లరేషన్ పేరిట ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇప్పుడు సాధ్యం కాదని చెప్పడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వీరణాల శివకుమార్, ముడియం చిన్ని, షాకీర్, ఓబులేసు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేంద్ర ప్రసాద్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

రాయచోటి : జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తి, విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని వ్యవసాయ అధికారులకు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ఇస్తున్నటువంటి ప్రత్యామ్నాయ విత్తనాలలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. విత్తనాలు, పురుగు నివారణ మందులు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సలహా మండలి సమావేశంలో లేవనెత్తిన సమస్యలన్నీ కూడా అధికారులు నోట్ చేసుకొని ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత సేవలు అందివ్వాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ మాట్లాడుతూ జిల్లాలో వేరుశనగ పంట అక్కడక్కడా వాడుతోందని, రైతులు అప్రమత్తంగా ఉండి 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసుకున్నట్లయితే కొన్ని రోజుల వరకు కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లాలో కౌలుదారుపత్రాలు గణనీయంగా ఇవ్వడం జరిగిందన్నారు. వీరందరికీ బ్యాంకుల ద్వారా లోన్ ఇప్పించే విధంగా అధికారులు కృషి చేయాలని, వీటికి బ్యాంకులు కూడా సహకరించాలని ఎల్‌డీఎంను కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా సభ్యులు భోదేశావళి, జిల్లా స్థాయి అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



మృతి చెందిన నరేంద్ర

రైల్వేకోడూరు : మండలంలోని శెట్టిగుంట మ్యాంగో పల్ప్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తొండం నరేంద్ర (26) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చియ్యవరం పంచాయతీ గురుమూర్తిపల్లెకు చెందిన తొండం నరేంద్ర మోటార్ బైక్‌లో తిరుపతికి బయలుదేరాడు. శెట్టిగుంట ప్రైవేటు మ్యాంగో పల్ప్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న పైపుల లారీ బైక్‌ను ఢీకొనడంతో నరేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవలే బెంగళూరులోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందిన నరేంద్ర మృతి చెందాడనే విషయం తెలియడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటినాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని సీఐ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ చక్రంలో చీర ఇరుక్కుని..

– కింద పడ్డ మహిళకు తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని పున్నాటివారిపల్లె రైల్వేగేటు సమీపంలో శుక్రవారం మోటార్ బైక్‌పై నుంచి కింద పడటంతో కరీమున్నీసా అనే మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. చెన్నరాజుపోడు నుంచి కరీమున్నీసా స్వగ్రామం పుల్లంపేట మండలం దళాయపల్లె గ్రామానికి తన అన్న కరీముల్లాతో కలిసి మోటార్ బైక్‌పై వెళుతోంది. పున్నాటివారిపల్లె రైల్వేగేటు సమీపంలో ఆమె చీర బైక్ వెనుక చక్రంలో పడి ఇద్దరూ కింద పడ్డారు. దీంతో కరీమున్నీసా తలకు తీవ్రగాయం కావడంతో చెవి, ముక్కులో రక్తస్రావం జరిగింది. ఎంపీడీఓ విజయారావు ప్రమాద స్థలంలో ఉండగా వెంటనే కారులో కరీమున్నీసాను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి దగ్గరుండి పంపించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు.

వెలుగుపల్లెలో కొండచిలువ



సిద్దవటం : మండల పరిధి వెలుగుపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పాలెం కిట్టగాళ్ల రమణమ్మ నివాస గృహంలో ఉన్న కట్టెల్లోకి శుక్రవారం రాత్రి కొండ చిలువ వచ్చి చేరింది. ఆమె కొండ చిలువను చూసి భయభ్రాంతులకు గురై కేకలు వేయడంతో గ్రామంలోని చుట్టుపక్కల వారు వచ్చి గుర్తించారు. దీని పొడవు దాదాపు 3 మీటర్లు ఉంటుంది. సమాచారం తెలుసుకున్న సిద్దవటం అటవీ శాఖ రేంజర్ కళావతి, డీఆర్ఓ ఓబులేస్ సిబ్బందితో వెళ్లి కొండ చిలువను పట్టుకున్నారు. దీనిని లంకమల అడవుల్లో వదిలి పెట్టనున్నట్లు రేంజర్ తెలిపారు.

టీడీపీ వర్గీయుల దౌర్జన్యం



పొలం వద్ద తొలగించిన కంచె



పొలం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

- పొలం కంచె తొలగించిన వైనం
- బాధితులు పోలీసులకు ఫిర్యాదు

రాజంపేట రూరల్ : టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. పొలం కంచె తొలగించి రైతులపై దాడికి దిగారు. దీంతో బాధితులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సంఘటన మండల పరిధిలోని ఊటుకూరు పంచాయతీ కొండ్లోపల్లి గ్రామ పొలాలలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1362 సర్వే నంబరులో 1995లో అప్పటి రెవెన్యూ అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీకి చెందిన 67 మందికి పట్టాలు ఇచ్చారని తెలియజేశారు. ఒక్కొక్కరికి 60 సెంట్ల చొప్పున మంజూరు చేసిన ఈ స్థలాన్ని సబ్ డివిజన్ చేయించాలని కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. అయినప్పటికీ తాము కొందరం తమకు కేటాయించిన స్థలం చదును చేసుకొని సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. అయితే గురువారం రాత్రి ఊటుకూరుకు చెందిన రాయపాటి సతీష్‌రాజు, గణేష్ తదితరులు జేసీబీ తీసుకువచ్చి తాము సాగు చేసుకుంటున్న పొలం కంచెను తొలగించారని ఆరోపించారు. అడ్డుగా పోయిన తమను నోటికి వచ్చినట్లు దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ మీదికి దాడి చేసేందుకు వచ్చారని తెలియజేశారు. ఇదే విషయం డీఎస్పీ చైతన్య దృష్టికి తీసుకెళ్లి, తమకు న్యాయం చేయాలని కోరామన్నారు. అనమతరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ భక్తవత్సలంకు ఫిర్యాదు చేశామని తెలియజేశారు. రెవిన్యూ అధికారులు స్పందించి తమకు కేటాయించిన స్థలం సరిహద్దులు చూపి ఆదుకోవాలని కోరారు. టీడీపీకి చెందిన వారు ఇంతగా దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. నిరసన తెలిపిన వారిలో రైతులు బత్తల క్రిష్ణయ్య, పీట్ల సుబ్బరాయుడు, రామయ్య, ఎస్.బలరామయ్య, ఎస్. చిన్నయ్య, హెచ్.హనుమంతు తదితరులు ఉన్నారు.

విద్యార్థినుల ఆచూకీ లభ్యం



విద్యార్థినులను ప్రిన్సిపాల్‌కు అప్పగిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : స్థానిక కోటపల్లె వద్ద గల ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థినుల ఆచూకీ లభ్యమైంది. వివరాలిలా వున్నాయి. గిరిజన గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువున్న ఎస్.యామిని, ఎస్.లల్లి శుక్రవారం ఉదయం 5 గంటలకు చెప్పకుండా వెళ్లిపోయారు. ప్రిన్సిపాల్ అన్నపూర్ణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు తమ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. వారిద్దరూ కోటపల్లె సమీపంలోని పార్కులో ఉండగా గుర్తించి స్థానిక సీఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. సీఐ మోహన్‌రెడ్డి పాఠశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగేంద్ర, ఎస్ఐలు లోకేష్, రహంతుల్లా, నాగేశ్వర, రమణ తదితరులు పాల్గొన్నారు.

బైక్, ట్రాక్టర్ ఢీ..



పుల్లంపేట : కడప– చెన్నై జాతీయ రహదారి 716 రెడ్డిపల్లె సమీపంలో శుక్రవారం ట్రాక్టర్ బైక్ ఢీకొనడంతో మహేష్ అనే యువకుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. రైల్వే కోడూరు నుంచి రాజంపేటకు వెళుతున్న ట్రాక్టర్.. రెడ్డిపల్లె సమీపానికి రాగానే పెద్ద గుంత ఉండటంతో పక్కనే వెళ్తున్న మోటార్ బైక్‌ను ఢీకొంది. బైక్‌పై నుంచి మహేష్ కింద పడి స్వల్ప గాయాల పాలయ్యాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్త్రీ 'నిధి' దోచేశారు..!

- రుణాల కంతులు బ్యాంకులకు చెల్లించకుండానే జేబుల్లోకి
- వ్యక్తిగత చెక్కులతో రుణాలు చెల్లింపు
- పీడీ పర్యవేక్షణలో నాలుగు బృందాల విచారణ
- పెద్దతిప్పసముద్రం మండలంలో వెలుగులోకి



పెద్దతిప్పసముద్రం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలంలో మహిళలకు అందించే స్త్రీ నిధి రుణాల్లో కొందరి మాయాజాలం వెలుగులోకి వస్తోంది. ఏళ్ల తరబడి ఈ రుణాల తిరిగి చెల్లింపులు లేకపోవడంతో స్త్రీ నిధి రుణాల మంజూరు ఆగింది. దీనికి కారణమేమిటని అధికారులు పరిశీలించగా.. భారీ స్థాయిలో రుణాల చెల్లింపు పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. దీనితో సమగ్ర విచారణ చేపట్టి లెక్కలు తేల్చేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. దీనితో పెద్దతిప్పసముద్రం మండలంలో స్త్రీ నిధి రుణాల వ్యవహారంపై విచారణకు నాలుగు బృందాలను నియమించగా క్షేత్ర స్థాయిలో విచారణ మొదలైంది. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ ఈ విచారణను పర్యవేక్షిస్తున్నారు.

వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా..

పెద్దతిప్పసముద్రం మండలంలో వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా మహిళా సంఘాలకు స్త్రీ నిధి రుణాలను మంజూరు చేశారు. స్త్రీ నిధికి సంబంధించి ఒక్కో సంఘం నెలకు రూ.100 పొదుపు చేయాలి. దీనిని విజయవాడలోని కార్యాలయం పర్యవేక్షిస్తుంది. ఇక్కడి నుంచి సంఘాలకు రూ.3.50 లక్షలు మంజూరు చేస్తారు. ఈ రుణం పొందిన సంఘాల సభ్యుల నుంచి నెలవారీ కంతులను సంఘమిత్రలు వసూలు చేసి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి. అయితే వీటి వసూళ్ల లేవు. బ్యాంకు ఖాతాలకు చెల్లింపులు జమ కావడం లేదని తేలింది. ఇవికాక మండల సమాఖ్య నుంచి గ్రామ సమాఖ్యలకు డబ్బు అప్పుగా ఇస్తారు. ఈ డబ్బును సంఘాలకు రుణాలుగా అందించాలి. ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఒక్కో సభ్యురాలికి వడ్డీ లేకుండా రూ.50 వేల రుణం ఇస్తారు. కంతుల చెల్లింపులో జాప్యం జరిగితే వడ్డీని వసూలు చేస్తారు. ఈ పథకాల ద్వారా చెల్లించిన రుణాల పరిస్థితి, ఆగిపోయిన రుణ వసూళ్లు, దానికి సంబంధించిన వ్యవహారాలపై ప్రస్తుతం సమగ్ర విచారణ మొదలైంది. మరో 3-4 రోజుల్లో విచారణ పూర్తయి నివేదిక సిద్ధం చేయనున్నారు.

- 2022 జనవరిలో పట్టేంవాడ్లపల్లె-3 గ్రామసమాఖ్య సమావేశం నిర్వహించగా..స్త్రీ నిధి రుణాలు పొందిన మహిళలు తిరిగి చెల్లించడం లేదని జాబితాను చదివి వినిపించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.
- మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ సంఘమిత్ర రూ.4.02 లక్షల రుణాలను వసూలు చేసి బ్యాంకుకు జమ చేయకుండా స్వాహా చేశాడు. ఈ విషయం బహిరంగమైనా అప్పట్లో విచారణ చేయాల్సిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేశారు.
- మండలానికి చెందిన ఓ సంఘమిత్ర నిబంధనలకు విరుద్ధంగా సంఘం పేరుతో కాకుండా రూ.1.99 లక్షల చెక్కును వ్యక్తుల పేరుతో చెల్లించారు. ఈ విషయం తెలిసినా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారన్న ప్రచారం జరిగింది.
- మండలంలోని మరో గ్రామానికి చెందిన ఓ సీసీ, సంఘమిత్ర కలిసి రూ.3.86 లక్షల రుణాలు వసూలుచేసి చెల్లించ లేదని గుర్తించగా, ఆ నిధులు తాము తీసుకున్నట్టు వారి నుంచి లేఖ కూడా రాయించుకున్నారు.
- స్త్రీ నిధి రుణాలు వసూలైన చెల్లించకుండా లక్షల్లో పెండింగ్‌లో ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనికారణంగానే మండలంలో మహిళా సంఘాలకు స్త్రీ నిధి రుణాలు మంజూరు కావడం లేదు. విచారణ పూర్తయ్యాక మళ్లీ రుణాల మంజూరు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.